నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

15 | హైదరాబాద్, బుధవారం 6 మార్చి 2024 | YADADRI BHUVANAGIRI

విత్తనాల విక్రయానికి డీలర్‌షిప్‌నకు ఆహ్వానం

మిర్యాలగూడ రూరల్, మార్చి 5 : మండలం నందిపహాడ్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా నాణ్యమైన విత్తనాలను విక్రయించేందుకు లైసెన్స్ కలిగి ఆసక్తి ఉన్న వ్యాపారులను డీలర్‌షిప్‌నకు ఆహ్వానిస్తున్నట్లు విత్తనాభివృద్ధి సంస్థ రీజినల్ మేనేజర్ కృష్ణవేణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో లైసెన్స్ కలిగిన వ్యాపారస్తులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9849908747 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

పోటీ పరీక్షల ఉచిత శిక్షణకు దరఖాస్తులు

నీలగిరి, మార్చి 5 : రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో గ్రూప్-1 ప్రిలిమ్స్, ఇతర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ కోసం ఈ నెల 22లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి టి.విజేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ స్టడీ సర్కిల్, కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో 45 రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ విద్యార్థులు దరఖాస్తులను జిల్లా కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9494345471, 7981196060 నెంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వస్తివాచనం కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు

ఎల్‌ఆర్‌ఎస్ చార్జీలపై బీఆర్‌ఎస్ గరం



కాంగ్రెస్ సర్కార్ తీరుపై తీవ్ర ఆగ్రహం

- గతంలో ఉచితమని.. ఇప్పుడు చార్జీలు వసూలా..?
- కాంగ్రెస్ నేతల ద్వంద్వ వైఖరిని ఎండగట్టేందుకు సిద్ధం
- నేడు నియోజకవర్గాల్లో ఆందోళనకు బీఆర్‌ఎస్ సన్నద్ధం

నల్లగొండ ప్రతినిధి, మార్చి 5 (నమస్తే తెలంగాణ) : లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్)పై కాంగ్రెస్ సర్కార్ మోసపూరిత వైఖరిని ఎండగట్టేందుకు బీఆర్‌ఎస్ సిద్ధమైంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలంటూ డిమాండ్ చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు అధికారంలోకి రాగానే ప్రజల నడ్డి విరిచేందుకు సిద్ధం కావడం పట్ల బీఆర్‌ఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తుంది. కాంగ్రెస్ సర్కార్ ద్వంద్వ వైఖరిని ఎండగట్టేందుకు దశల వారీ ఆందోళనలకు సన్నద్ధమవుతున్నది. ఈ క్రమంలో బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ధర్నాలకు పిలుపునిచ్చింది. అందులో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నేడు నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించనుంది.

గతంలో బీఆర్‌ఎస్ సర్కార్ ఎల్‌ఆర్‌ఎస్‌ను తీసుకొచ్చినప్పుడు అప్పటి రాష్ట్ర కాంగ్రెస్ పెద్దలు అనధికారిక లేఅవుట్‌లోని ప్లాట్లను ఉచితంగానే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి రాగానే ఎలాంటి చార్జీలు వసూలు చేయకుండానే రెగ్యులరైజ్ చేస్తామని కూడా ప్రకటించారు. అంతటితో ఆగకుండా జిల్లాకు చెందిన ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అప్పట్లో ఎల్‌ఆర్‌ఎస్‌పై కోర్టులో కేసు వేసి అడ్డుకున్నారు. కానీ.. నేడు అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు నాలుక మడతేశారు. ప్రభుత్వ ఖజానాను నింపుకొనేందుకు ఎల్‌ఆర్‌ఎస్ అమలుకు సిద్ధమవుతూ చార్జీల వసూలుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇటీవలే ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిస్థితిని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను నివేదిక కోరారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2.54లక్షల ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారుల లెక్కలు వెల్లడిస్తున్నాయి.

అనధికారిక లేఅవుట్లు, ప్రభుత్వ భూముల్లో ఇండ్లు నిర్మించుకుని క్రమబద్ధీకరణ కాకుండా ఇబ్బందులు పడుతున్న వారి కోసం అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్, బీఆర్‌ఎస్ స్కీమ్‌లను తీసుకొచ్చింది. 2015లోనే కేసీఆర్ సర్కార్ 20వేల దరఖాస్తులను పరిష్కరించింది. ఆ తర్వాత కూడా ఇంకా పెండింగ్‌లో ఉన్న వాటి కోసం 2020 ఆగస్టు నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించింది. దీన్ని ముందుకు పడకుండా అప్పట్లోనే కాంగ్రెస్ నేతలు అడుగడుగునా కుట్రలు చేశారు. కోర్టుల్లో కేసులు వేసి ఎల్‌ఆర్‌ఎస్ అమలు కాకుండా అడ్డుకున్నారు. దీంతో అప్పటి ప్రభుత్వం కూడా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను పక్కన పెట్టక తప్పలేదు. కాగా, ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ వనరులను సమీకరించుకోవడం కోసం ఎల్‌ఆర్‌ఎస్‌ను ఆయుధంగా వాడుకోవాలని భావిస్తున్నది. ఇన్నాళ్లూ అడ్డంకులు సృష్టించి ఇప్పుడేమో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించేందుకు సిద్ధపడింది. రాష్ట్ర వ్యాప్తంగా 25లక్షల దరఖాస్తుదారుల నుంచి సుమారు రూ.20వేల కోట్ల ఆదాయాన్ని ఆశిస్తూ ప్రజల జేబుకు చిల్లు పెట్టే పనిలో పడింది. లేఅవుట్ రెగ్యులరైజేషన్ కోసం రెట్టింపు చార్జీలు వసూలు చేయనున్నారు. సాధారణంగా రిజిస్ట్రేషన్ కోసం మార్కెట్ విలువలో 7.5 శాతం రుసుంను స్టాంప్ డ్యూటీగా వసూలు చేస్తుంటారు. కానీ.. ప్రస్తుతం ఎల్‌ఆర్‌ఎస్ పేరుతో 14శాతం స్టాంప్ డ్యూటీగా కట్టించుకోనున్నట్లు సమాచారం. ఇదే జరిగితే ఒక్కో దరఖాస్తుదారుడిపై సగటున లక్ష రూపాయల భారం అనుకున్నా.. ఉమ్మడి జిల్లాలో రూ.2,540 కోట్లు వసూలు చేయనున్నారు. అప్పుడు ఉచితమని డిమాండ్ చేసిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు కూడా ఉచితంగానే అమలు చేయాలని బీఆర్‌ఎస్ డిమాండ్ చేస్తున్నది. అందులో భాగంగానే నేడు ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళనలకు సిద్ధమైంది. కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వైఖరిని నిరసిస్తూ ధర్నాలు చేపట్టనున్నారు. ఉదయం 11 గంటల నుంచి ఈ ధర్నాలు ప్రారంభం అవుతాయని, దరఖాస్తుదారులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో రావాలని బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పిలుపునిచ్చారు. రేపు జిల్లా కలెక్టర్లకు, ఆర్డీఓలకు ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని కోరుతూ వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్ నిరసనను విజయవంతం చేయండి

- ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

భువనగిరి అర్బన్ : ఎన్నికల ముందు ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా ఇవ్వాలన్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రుసుం విధించడాన్ని ఖండిస్తూ బుధవారం భువనగిరిలోని బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు పార్టీ పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మహా శివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

- యాదగిరిగుట్ట రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వస్తివాచన పూజలు

యాదగిరిగుట్ట, మార్చి5 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి అనుబంధమైన పర్వతవర్ధినీ రామలింగేశ్వరస్వామి ప్రధానాలయంలో మహ శివరాత్రి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆరు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో తొలిరోజు ఉదయం 11.30 గంటలకు స్వస్తి వాచనంతో శ్రీకారం చుట్టారు. స్వస్తివాచనంతో లోకంలోని సర్వవిఘ్నాలు, సర్వవిధ దోషాలు తొలగి ఈశ్వర అనుగ్రహం కలుగాలని, శైవాగమ సంప్రదాయ రీతిలో ఈ వేడుకను జరిపించారు. అనంతరం విష్వేశ్వర ఆరాధన చేశారు. వేదమంత్ర పఠనంతో పవిత్ర జలం, పూజ ద్రవ్యాలను ఆలయ పరిసర ప్రాంతంలో ప్రోక్షణ గావించి శుద్ధి పుణ్యాహవాచన కార్యక్రమం చేపట్టారు. ఉత్సవాలు పరమేశ్వర అనుగ్రహంతో సక్రమంగా నిర్వహింపబడాలని శాస్త్రోక్తంగా రక్ష బంధనాలు , పూజాధికాలు నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు, భక్తులకు రక్షబంధనాలను యాజ్ఞికులు, ఆలయ అర్చకులు ధరింపజేశారు.

అంకురారోపణం

ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం పారాయణికులు నమక, చమక పారాయణాలు, మంత్రపుష్ప పఠనం, అంకురారోపణం, సోమకుంభ, కలశస్థాపన, దేవతారాధన పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఏఈఓలు రమేశ్ బాబు, శ్రవణ్‌కుమార్, ప్రధాన పురోహితులు సత్యనారాయణ శర్మ, శివాలయ ప్రధానార్చకులు నరసింహరాములు శర్మ, ఆలయ అధికారులు చంద్రమౌళి పాల్గొన్నారు.

నేడు దేవతాహ్వానం..

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ధ్వజ పటారోహణం, భేరీ పూజ, దేవతాహ్వానం, అగ్ని ప్రతిష్ఠ వంటి పూజలు నిర్వహించనున్నారు.

లక్ష్మీనరసింహుడికి సుప్రభాత సేవ

యాదగిరి గుట్ట ప్రధాన ఆలయాన్ని తెల్లవారుజామున తెరిచిన అర్చకులు సుప్రభాతంతో లక్ష్మీనరసింహ స్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన, ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామివారికి సహస్రనామార్చన చేపట్టారు. స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. ప్రధానాలయ ముఖమండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణపుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ వైభవంగా చేపట్టారు. ప్రధానాలయం, క్యూ కాంప్లెక్స్, శివాలయంలో చెంతనగల క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి ఆకుపూజను ఘనంగా నిర్వహించారు. హనుమంతుడిని సింధూరంతో అలంకరించి అభిషేకించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 8 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 14,92,242 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి, పక్కన ప్రభుత్వ విప్ బీర్ల, ఎమ్మెల్యే సామేలు

వాడీవేడిగా జడ్పీ సమావేశం

- జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేల్ మధ్య వాగ్వాదం
- సర్దిచెప్పిన ప్రభుత్వ విప్ అయిలయ్య
- తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి : ప్రభుత్వ విప్

భువనగిరి కలెక్టరేట్, మార్చి 5 : జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన జడ్పీ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా కొనసాగింది. జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై నివేదికలు సమర్పించారు. వ్యవసాయ శాఖ పనులపై డీఏఓ అనూరాధ నివేదిక చదివి వినిపిస్తుండగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ కలుగజేసుకుని గత ప్రభుత్వం రైతుబంధును గుట్టలకు, గుండ్లకు చెల్లించి పథకాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. దీనికి స్పందించిన జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి జడ్పీ సమావేశంలో రాజకీయ ప్రసంగాలు, ఆరోపణలు చేయడం తగదన్నారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కలుగజేసుకుని సర్దిచెప్పారు.

అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలి : ప్రభుత్వ విప్

అనంతరం ప్రభుత్వ విప్ అయిలయ్య మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడాలని అన్నారు. వేసవిలో తాగునీటికి అధిక ప్రాధాన్యమివ్వాలని, ప్రజాప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యంతో నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలని సంబంధిత ఇంజినీర్లను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.పది కోట్లు మంజూరు చేసిందని, అందులో రూ.2 కోట్లు తాగునీటికి కేటాయించడం జరిగిందని తెలిపారు. గ్రామాల్లో పైప్‌లైన్లను పరిశీలించి లీకేజీలకు వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. ఆలేరు, భువనగిరి, జనగాం 16 కిలోమీటర్ల పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరమున్న చోట బోర్లను లీజుకు తీసుకోవాలని సూచించారు. వారం రోజుల్లో మండలాల వారీగా సంబంధిత శాఖలు సమావేశమై తీసుకోవాల్సిన చర్యలను రూపొందించుకొని క్షేత్రస్థాయిలో ఇబ్బందులను తొలగించాలని ఆదేశించారు. ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలను సంబంధిత ప్రజాప్రతినిధులకు అందజేయాలని, వారిని భాగస్వాములను చేయాలని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. గుండాల మండలంలో ప్రొటోకాల్ ఉల్లంఘనపై తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను ఆదేశించారు. రూ.18 కోట్లతో చేపట్టే వడపర్తి, మర్యాల, చీకటిమామిడి రోడ్లకు వారం రోజుల్లో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : జడ్పీ చైర్మన్

జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి సమస్యలు తలెత్తినా సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సభ్యులకు వివరించాలని సూచించారు. గ్రామాలు, మండలాల్లో అధికారులు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. ప్రజల ఇబ్బందులు, సమస్యలను తొలగించేందుకు కృషి చేయాలని కోరారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి రూ.3 కోట్లు మాత్రమే ఇచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రూ.పది కోట్లు మంజూరు చేసిందని అన్నారు. ఇందులో రూ.2 కోట్లు తాగునీటికి వెచ్చించడం జరుగుతుందని, అవసరమైతే మరో కోటి రూపాయలు వెచ్చిస్తామని, తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. రహీంఖాన్‌పేట – మోత్కూరు రోడ్డును 3 నెలల్లో పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని ఆర్ అండ్ బీ ఇంజినీర్ శంకరయ్యకు సూచించారు. కలెక్టర్ హనుమంతు కె.జెండగే మాట్లాడుతూ రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలకు గత డిసెంబర్‌లో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను కంప్యూటరైజేషన్ చేశామన్నారు. వాటికి సంబంధించి ఎంపీడీఓ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆధార్ కార్డు, గ్యాస్ నెంబర్, రేషన్ కార్డు, ఎలక్ట్రిసిటీ సర్వీసు నెంబర్ తదితర వివరాలు అందించనివారు హెల్ప్ డెస్క్‌లో ఇవ్వాలని సూచించారు. నాలుగు నెలలకోసారి ప్రజా పాలన దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో పలువురు సభ్యులు సమస్యలను వివరించారు. రైతు బీమా పథకం గురించి రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి రైతును నమోదు చేయాలని సూచించారు. మంచినీటి ఇబ్బందులు రాకుండా చూడాలని, పైప్‌లైన్ల లీకేజీలను అరికట్టాలని కోరారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు లేకుండా చేయాలని, గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కార్యాచరణ చేపట్టాలన్నారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ ధనావత్ బీకూనాయక్, సీఈఓ శోభారాణి, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన జడ్పీ సభ్యులు

రాజాపేటలో రైతు రేగు రాములుకు చెందిన ఎండిన వరి చేనులో మేస్తున్న గొర్రెలు

జీవాలకు మేతగా వరి పొలాలు

- నీళ్లు లేక ఎండుతున్న పంటలు
- బోర్లు వేసినా ఫలితం లేక ఆశలు వదులుకుంటున్న రైతన్నలు

రాజాపేట, మార్చి 5 : భూగర్భ జలాలు అడుగంటడంతో సాగుకు నీరందక రైతన్నలు అష్టకష్టాలు పడుతున్నారు. కండ్ల ముందే ఎండిపోతున్న పంటలను చూసి తల్లడిల్లిపోతున్నారు. చేతికొచ్చే వరి పంటను కాపాడుకునేందుకు బోర్లు వేస్తున్నా చుక్క నీరు పడడం లేదు. దాంతో ఆశలు వదిలేసుకొని పశువులు, గొర్రెలకు మేతగా వదిలేస్తున్న దుస్థితి నెలకొన్నది. రాజాపేట మండలంలో ప్రస్తుతం రైతులు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది రాజాపేట శివారులోని గోపాల్ చెరువు పూర్తిగా ఎండిపోయింది. దాని అయకట్టు కింద భూగర్భ జలాలు అడుగంటి పోయి బోర్లు, బావులు పోయడం లేదు. ప్రస్తుతం ఎండలు ముదరడంతో నీటికి తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. చెరువు ఆయకట్టు కింద సాగు చేసిన వరి పంటలు ఎండు మొఖం పట్టాయి. మండల కేంద్రానికి చెందిన జెన్నె సిద్దులు, రేగు రాములు, సట్టు తిరుమలేశ్, కుమ్మరి లక్ష్మణ్, కర్రె గణేశ్, సిద్దయ్య, రేగు కనకయ్యతో పాటు మరి కొంత మంది రైతులు సాగు చేసిన వరి పంటలు ప్రస్తుతం పొట్ట దశలో ఉండగా ఎండిపోయాయి. ఎండిన పంటలు పశువులు, జీవాలకు పశుగ్రాసంగా మారాయి. కొంత మంది రైతులు ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు అప్పులు చేసి బోర్లు వేసినా చుక్క నీరు రాక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఐదేండ్లుగా ఇలాంటి దుస్థితి రాలేదని, పంటలు ఎండి పోలేదని రైతులు వాపోతున్నారు.

నెర్రెలు బారిన పొలాన్ని చూపుతున్న రైతు సిద్దులు

నీళ్లు లేక పశువులను మేపుతున్నం

రాజపేట గోపాల్ చెరువు ఆయకట్టు కింద ఉన్న నా బోరు ఐదేండ్లుగా ఎప్పుడూ వట్టిపోలేదు. ఈ సారే భూగర్భ జలాలు అడుగంటి ఎండిపోయింది. 30 రోజులైతే నేను సాగు చేసిన రెండు ఎకరాల వరి పంట చేతికొచ్చేది. నీళ్లు లేక పూర్తిగా ఎండి పోయింది. చేసేదేమీ లేక పశువులను మేపుతున్నాం. అప్పు చేసి సాగు చేసిన పంట ఎండి పోయింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– జెన్నె సిద్దులు, రైతు, రాజాపేట

భువనగిరి మున్సిపల్ బడ్జెట్ ₹49.49 కోట్లు

- ఆమోదం తెలిపిన కౌన్సిల్ సభ్యులు

భువనగిరి అర్బన్, మార్చి 5 : భువనగిరి మున్సిపాలిటీ 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.49.49 కోట్ల అంచనాతో బడ్జెట్‌ను రూపొందించారు. దీనికి కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం బడ్జెట్‌పై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రూ.49,49,75,000 బడ్జెట్‌ను ప్రవేశపెట్టిగా కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. ప్రస్తుతం మున్సిపల్ బడ్జెట్ ప్రారంభ నిల్వ రూ.2.77 కోట్లు ఉన్నది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.46,88,80,000 ఆదాయం వస్తుందని అంచనా వేశారు. మొత్తం నిల్వ రూ.49,66,52,000 ఉండనున్నట్లు పేర్కొన్నారు. ఈ మొత్తంలో నుంచి రూ.49,49,75,000 ఖర్చు చేయనుండగా.. 2024–25 మార్చి వరకు రూ.16.77 లక్షలు నిల్వ ఉండనున్నట్లు అంచనా వేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పి.వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ మాయ దశరథ, కమిషనర్ పి.రామానుజులరెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ పి.వెంకటేశ్వర్లు

భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని పగిడిపల్లిలో అద్భుతంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయం

మినీ తిరుపతి.. స్వర్ణగిరి వేంకటేశ్వర క్షేత్రం

- మినీ తిరుపతి.. స్వర్ణగిరి వేంకటేశ్వర క్షేత్రం
- 22 ఎకరాల్లో సుందరంగా నిర్మాణం
- నేడు ప్రాణప్రతిష్ఠ.. ప్రముఖుల హాజరు

యాదాద్రి భువనగిరి, మార్చి 5 (నమస్తే తెలంగాణ)/భువనగిరి కలెక్టరేట్ : జిల్లాలో మరో ప్రముఖ పుణ్యక్షేత్రం అలరారనున్నది. భువనగిరి పరిధిలో పగిడిపల్లిలో అద్భుతంగా నిర్మించిన వేంకటేశ్వర క్షేత్రం మినీ తిరుపతిగా విరాజిల్లనున్నది. 22 ఎకరాల్లో అత్యంత సుందరంగా రూపుదిద్దుకున్న ఆలయానికి స్వర్ణగిరి అని నామకరణం చేశారు. శుక్రవారం ఉదయం 11.06 గంటలకు త్రిదండి చినజీయర్ స్వామి బుధవారం ప్రాణప్రతిష్ఠ చేయనున్నారు. పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు. ఈ మేరకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వర్ణగిరి క్షేత్రం విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా విరజిమ్ముతున్నది.

క్షేత్రం విశేషాలు ఇవి..

ప్రముఖ వ్యాపారవేత్త మానేపల్లి రామారావు ఆలయాన్ని నిర్మించారు. స్తపతి డీఎన్‌వీ ప్రసాద్ పర్యవేక్షణలో ఆలయాన్ని నిర్మించారు. వివిధ రకాల శిలలతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. 12 అడుగుల ఎత్తులో వేంకటేశ్వర స్వామి విగ్రహం, ఎత్తయిన శంకు చక్రాలు రూపొందించారు. స్వాగత తోరణం తర్వాత బ్రహ్మరథం, శ్రీవారి పాదాలు, రామానుజాచార్యుల విగ్రహం దర్శనమిస్తాయి. ఆలయ ప్రధాన తూర్పు గోపురానికి త్రైలెక్య మల్ల రాజగోపురం, దక్షిణ రాజగోపురానికి త్రిభువన మల్ల రాజగోపురం, పశ్చిమ గోపురానికి భువనైక మల్ల రాజగోపుం, ఉత్తర గోపురానికి కాకతీయ రాజుల బిరుదులతో రాయ గజకేసరి రాజగోపురం అని నామకరణం చేశారు. 61 అడుగుల ఎత్తయిన ధ్వజస్తంభం, బలిపీఠం కనిపిస్తాయి. ఆలయ ఆవరణలో గరుడ ఆల్వార్, 10 చేతులతో దర్శనమిచ్చే మదన గోపాలకృష్ణ స్వామి, పద్మావతి అమ్మవారి దేవాలయాలను నిర్మించారు. సుమారు 12 అడుగులకు పైగా ఎత్తులో శంకు చక్రాలతో, వరద కటి హస్తాలతో చరమ శ్లోక ప్రదాత వేంకటేశ్వర స్వామి దివ్యరూపాన్ని తీర్చిదిద్దారు. ఆండాళ్–గోదాదేవి సన్నిధి, స్వామివారి గురువు భగవత్ రామానుజాచార్య ఆలయం కొలువుదీరింది. ఉత్తర ద్వారం ద్వారా బయటకు వస్తే ఎదురుగా 27 అడుగుల కార్యసిద్ధి హనుమాన్ విగ్రహం దర్శమిస్తుంది. ఆరు అడుగుల ఎత్తు, 1,500 కిలోల రాగితో తయారైన పెద్ద జయ గంట కనిపిస్తుంటాయి. ఈ క్షేత్రం తెలంగాణలోనే అతిపెద్ద వేంకటేశ్వర ఆలయమని నిర్వాహకులు చెప్తున్నారు. ఈ నెల 7 నుంచి భక్తులకు పూజా కార్యక్రమాలకు అనుమతివ్వనున్నారు.

కనులపండువగా పారువేట

అర్వపల్లి, మార్చి 5 : అర్వపల్లి యోగానంద లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం పారు వేట కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా 15 రోజులపాటు ప్రతి రోజు జరిగిన ఒక ఉత్సవంలో అలిసిపోయిన నారసింహుడు అమ్మవార్లు శ్రీదేవి, భూదేవితో కలిసి విశ్రాంతి కోసం అశ్వ వాహనంపై ఊరేగింపుగా వేటకు బయల్దేరారు. ఆలయానికి రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి అటవీ ప్రాంతంలో వేటను ముగించుకొని తిరిగి రాత్రి ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు మంగళ హారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టారు.

పారువేటలో పాల్గొన్న భక్తులు